క్లుప్తంగా

ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి


శ్రీరాం చక్రవర్తి

హుస్నాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అమలు చేయడం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొమ్మ శ్రీరాంచక్రవర్తి అన్నారు. పట్టణ కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలన్నారు. హామీల అమలు కోసం ఆదివారం పట్టణంలో దీక్ష చేయనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలను రేవంత్ రెడ్డి సర్కార్ దగా చేసిందని ఆరోపించారు. కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌ని గెలిపించాలని కోరారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇంత వరకు కరీంనగర్ ఎంపీ అభ్యర్థిని ప్రకటించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి

ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సతీష్


కార్యకర్తలతో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సతీష్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దేశాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సతీష్ అన్నారు. ఎన్‌ఎస్‌యూఐ సిద్దిపేట నియోజకవర్గ సన్నాహక సమావేశం శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ విజయానికి ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు బడికోల్ రాకేష్ యాదవ్, రూరల్ మండల అధ్యక్షుడు గ్యార రఘుపతి, నాయకులు మొగిలి రాకేష్, సాజిద్, వరుణ్, లోకేష్, రఘు, రియాజ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు

వర్గల్(గజ్వేల్): మండలంలోని మైలారం హైస్కూల్‌లో శనివారం అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచినవారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు రవి, నాయకులు కృష్ణ, కనకయ్య, శ్రీను, వెంకట్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఉసురు తగులుద్ది

డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు


మాట్లాడుతున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎన్నికల కోడ్ ఉల్లంఘించి సమావేశం నిర్వహించి 106 మంది ఉద్యోగుల సస్పెన్షన్‌కు కారణమైన ఎమ్మెల్యే హరీశ్‌రావుకు వారి కుటుంబాల ఉసురు తగులుతుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓట్ల కోసం ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడారన్నారు. ఉద్యోగుల సస్పెన్షన్‌తో జిల్లాకు చెడ్డ పేరు తెచ్చారని బీఆర్‌ఎస్‌పై మండిపడ్డారు. సమావేశంలో నాయకులు మహేందర్, పర్శరామ్, గణేష్, శ్రీనివాస్ రెడ్డి, రాజు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీపీఐ నిలుస్తుంది

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అశోక్


పార్టీలో చేరిన వారితో అశోక్

చేర్యాల(సిద్దిపేట): సీపీఐ పేదలకు అండగా నిలబడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కొమురవెల్లి, మద్దూరు మండలాలకు చెందిన పలువురు పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీకి చరమగీతం పాడి ప్రజా సంక్షేమం కోరే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో సీపీఐ మిత్రపక్షంగా నిలిచి మార్పు కోసం కృషి చేసిందన్నారు.

బావి పదిలం.. నీరు పుష్కలం

మిరుదొడ్డి(దుబ్బాక): 'సముద్రమంత దాహం వేసినా కోరెను చేద బావి నీటినే' అన్న ఓ సినీ కవి పాటరచనలో చేద బావి విలువను తెలియజేస్తోంది. అలాంటి చేద బావులు పల్లెల్లో కనుమరుగై పోయాయి. కానీ, మండల కేంద్రమైన మిరుదొడ్డిలో లింగాల అంజిరెడ్డి ఇంటిలో ఇప్పటికీ ఓ చేద బావి చెక్కు చెదరకుండా దర్శనమిస్తోంది. ఈ బావిలో అన్ని కాలాల్లో పుష్కలంగా నీరు లభిస్తుంది. చుట్టు పక్కల వారు మండు వేసవిలో సైతం ఈ నీటిని ఇప్పటికీ వినియోగిస్తున్నారు. నీటిని తోడుకోవడానికి తాడు, బకెట్టు అందుబాటులో ఉన్నాయి. పొరపాటున బకెట్టు బావిలో పడితే దానిని తీయడానికి పాతాళ గరిగె అందుబాటులో ఉండటం విశేషం.


మిరుదొడ్డిలో చేద బావి


బావిలో నీరు


నీటిని తోడుతున్న మహిళ


పాతాళ గరిగె

బూర నర్సయ్య గెలుపు ఖాయం

బీజేపీ జిల్లా కార్యదర్శి ఎంపీటీసీ కూరెళ్ల రాజుగౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న కూరెళ్ల రాజు

మద్దూరు(హుస్నాబాద్): బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గెలుపు ఖాయమని ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఎంపీటీసీ కూరెళ్ల రాజు గౌడ్ అన్నారు. శనివారం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో దాదాపుగా రూ.9 కోట్ల నిధులతో నర్సయ్యగౌడ్ అనేక అభివృద్ధి పనులు చేశారన్నారు. ఇటీవల ఆయనపై మాజీ ఎమ్మెల్సీ రాజలింగం చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమన్నారు. కేంద్రంలో మోదీ ఉంటే దేశం అభివృద్ధిలో ఎలా ముందుకు పోతుందో, అదే విధంగా భువనగిరి అభివృద్ధి చెందాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బూర నర్సయ్య గౌడ్‌ను భారీ మోజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బూర్గు సురేష్‌గౌడ్, మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ, మండల అధ్యక్షుడు నలసాని భాస్కర్‌రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు నాగలక్ష్మి, చేర్యాల పట్టణ అధ్యక్షుడు మన్నె సత్యవర్ధన్, సీనియర్ నాయకులు రాపాక బుచ్చిరెడ్డి, కర్రె వీరన్న, నాయకులు దాసరి కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తూకంలో తేడా వస్తే కఠిన చర్యలు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ విద్యాసాగర్

అక్కన్నపేట(హుస్నాబాద్): ధాన్యం తూకం వేసే సమయంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ విద్యాసాగర్ హెచ్చరించారు. మండలంలోని అంతక్కపేట, జనగామ, గొల్లకుంట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి లాభాలు పొందాలని, దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, సీసీలు తిరుపతి, భిక్షపతి, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చింత మడక గ్రామస్తులు

సిద్దిపేటజోన్: నియోజకవర్గ పరిధిలో జరగనున్న శ్రీరామనవమి, పెద్దమ్మ, పోచమ్మ ఉత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే హరీశ్ రావును నిర్వాహకులు కోరారు. ఈ మేరకు శనివారం క్యాంపు కార్యాలయంలో కేసీఆర్ స్వగ్రామం చింత మడకలోని పట్టాభి రామాలయం, సిద్దిపేటలోని రామాలయంలో, హౌసింగ్ బోర్డ్ హనుమాన్ దేవాలయం, హరిప్రియ నగర్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో జరిగే శ్రీరామనవమి వేడుకలు, ఆయా గ్రామాల్లో జరిగే గ్రామ దేవతల ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వాన పత్రికలు అందజేశారు.

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని ఇర్కోడ్‌లో పోచమ్మ కల్యాణం, చింతమడకలో శ్రీ పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణం కార్యక్రమాల్లో శనివారం ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ఆయనకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముదిరాజు కులస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సుడా చైర్మన్ రవీందర్‌రెడి పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలి

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్


మాట్లాడుతున్న శ్రీనివాస్

దుబ్బాక: ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని ఎన్నికల్లో పోటీచేసేందుకు అనర్హుడిగా ప్రకటించాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్ అన్నారు. శనివారం దుబ్బాకలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 2023 శాసనసభ ఎన్నికల్లో వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో డబ్బులు పంపిణీ చేయడం జరిగిందన్న విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. ఇటీవల సిద్దిపేటలో ప్రభుత్వ ఉద్యోగులను ప్రలోభాలకు గురిచేసి 106 మంది సస్పెన్షన్‌కు కారకుడైన వ్యక్తి ఎన్నికల్లో పోటీ చేస్తే ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు.

దుబ్బాక మున్సిపల్ బీజేవైఎం అధ్యక్షుడిగా నేహాల్‌గౌడ్


నియామక పత్రం అందుకుంటున్న పల్లె నేహాల్‌గౌడ్

దుబ్బాక: దుబ్బాక మున్సిపాలిటీ బీజేవైఎం అధ్యక్షుడిగా పల్లె నేహాల్‌గౌడ్ నియమితులయ్యారు. శనివారం బీజేపీ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు సుభాష్‌రెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేహాల్‌గౌడ్ మాట్లాడుతూ మెదక్ ఎంపీగా రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా నియమించినందుకు రఘునందన్‌రావు, బీజేపీ రాష్ట్ర నాయకులు లకు కృతజ్ఞతలు తెలిపారు.

హిందీ ఉపాధ్యాయుడికి జాతీయ పురస్కారం


బాబు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని కల్లెపల్లి గ్రామానికి చెందిన హిందీ ఉపాధ్యాయుడు బిగుల్ల బాబుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ పురస్కారం లభించింది. ఢిల్లీ భారతీయ దళిత్ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి 2023 అవార్డుల ప్రదానంలో ఆయనకు సంస్థ జాతీయ అధ్యక్షుడు సుమనాక్షర్ అవార్డు అందజేశారు. హిందీ నవలల్లో దళిత చైతన్యంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ సాధించిన బాబును గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారు. పురస్కారం లభించినందుకు బెజ్జంకి వివేకానంద యూత్ అధ్యక్షుడు రజనీకాంత్, మిత్ర బృందం అభినందించారు.

అనుమతులు రద్దు చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): పొలాలకు నష్టం వాటిల్లే ప్రమాదమున్నందున ఇథనాల్ ఫ్యాక్టరీలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బెజ్జంకిలో సీపీఎం మండల కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గుగ్గిల్ల, పోతారం గ్రామాల రైతులు, ప్రజాభిప్రాయం లేకుండా దొడ్డిదారిన అనుమతులు పొందారన్నారు.

నిందితుడి రిమాండ్


నిందితుడిని చూపుతున్న ఎస్‌ఐ అపూర్వ రెడ్డి

సిద్దిపేటరూరల్: దొంగతనం కేసులో పట్టుబడ్డ నిందితుడిని కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ అపూర్వ రెడ్డి శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని రావురూకుల గ్రామంలో జనవరిలో దొంగతనానికి పాల్పడ్డ రాజమియాను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని సిద్దిపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ చందన ఎదుట హాజరు పరచగా రిమాండ్ విధించారు. దీంతో నిందితుడిని సిద్దిపేట జైలుకు తరలించారు.

పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక కావాలి

కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్


మాట్లాడుతున్న కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్

హుస్నాబాద్: తెలంగాణ సమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నించే సత్తా కేవలం బీఆర్‌ఎస్ పార్టీకే ఉందని, అందుకు ప్రశ్నించే గొంతుక ఉండాలని కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బొయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. హుస్నాబాద్‌లోని శుభం గార్డెన్‌లో శనివారం హుస్నాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ యూత్, విద్యార్థి, సోషల్ మీడియా చైతన్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్యపాలనలో ఆనాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీలో తెలంగాణ వస్తే కరెంట్ ఉండదని, కరెంట్ తీగలపై బట్టలు ఆరేసుకోవాలని హేళన చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న తర్వాత కరెంట్‌ను అద్భుతంగా ఉత్పత్తి చేసుకుంటూ ఇతర రాష్ట్రాలకు ఇచ్చే స్థాయికి కేసీఆర్ తెలంగాణను తీర్చిదిద్దారన్నారు. అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. కల్యాణ లక్ష్మి పథకం కింద రూ.లక్ష, తులం బంగారం ఇస్తామన్న హామీ నేటికీ నేరవేర్చలేదన్నారు. దేవాదుల నుంచి నీటిని విడుదల చేయకపోవడంతో వందలాది ఎకరాల పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతుంటే ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ప్రతీ జిల్లాకు నవోదయ పాఠశాల ఉండాలని చట్టం చెబుతుందన్నారు. జిల్లాకు నవోదయ పాఠశాల కావాలని ఏనాడు ఎంపీ బండి సంజయ్ పార్లమెంట్‌లో మాట్లాడలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రవీందర్ రావు, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ప్రకాష్, దరువు ఎల్లన్న, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కర్ర శ్రీహరి, పేర్యాల రవీందర్ రావు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అమ్మవార్ల దీవెనలు ఉండాలి

ఎమ్మెల్యే హరీశ్‌రావు


మహంకాళి అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

నంగునూరు(సిద్దిపేట): అమ్మవార్ల దీవెనలతో ఈప్రాంత ప్రజలు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. తిమ్మాయిపల్లిలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మహంకాళి, బాషగూడెంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మహంకాళి అమ్మవారికి పూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి సత్కరించి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చేపట్టిన ప్రతీపనిలో విజయం సాధించేలా అనుగ్రహించాలని అమ్మవారిని ప్రార్థించానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు శ్రీకాంత్‌రెడ్డి, సారయ్య, నాయకులు సోమిరెడ్డి, మల్లయ్య, మహిపాల్‌రెడ్డి, లింగంగౌడ్, నర్సింలు, కృష్ణ, రెడ్డి సంఘం, ముదిరాజ్ సంఘం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో హోమంలో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ ముత్తినేని రాజేశ్వర్‌రావు దంపతులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కేశవాపూర్ శ్రీపార్వతిరామలింగేశ్వర స్వామి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్తినేని రాజేశ్వర్ రావు, గ్రామస్తుల ఆధ్వర్యంలో మండపారాధన, రుద్రహోమం, శాంతి హోమం, స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

చికిత్స పొందుతూ రైతు మృతి


పరమేష్‌గౌడ్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్యకు యత్నించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కుకునూరుపల్లి గ్రామానికి చెందిన పరమేష్‌గౌడ్ వ్యవసాయంతో పాటు కూలిపనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సాగు కోసం పెట్టిన పెట్టుబడులు రాకపోవడంతో పాటు ఇంటి నిర్మాణం కోసం చేసిన బ్యాంకు రుణం తీసుకున్నాడు. అప్పుల చెల్లించే మార్గం కానరాక మదనపడేవాడు. ఈనెల 7వ తేదీన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు అనుమానంతో గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి, పరిస్థితి విషమించడంతో 8వ తేదీన లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **మృతుడి కుటుంబానికి చేయూత**



చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని పెద్దకోడూరు గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు సుల్తాన్ రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి చిన్ననాటి స్నేహితుడు వర్కోలు రంగరాజం శనివారం స్నేహితుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.20 వేలు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చెరుకు నారాయణ రూ.10 వేలు సాయం అందజేశారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రాజు, శ్రీశైలం, శ్రీహరి, సంతోష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **చలివేంద్రం ప్రారంభం**

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల పోలీస్ స్టేషన్ ఎదురుగా సత్యం లాండ్రీ యజమాని రాచకొండ శ్రీనివాస్ బాటసారుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం బీఆర్‌ఎస్ నాయకుడు ఎక్బాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఏడేళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీరుస్తున్నానన్నారు.

◆ **ఘనంగా టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం**

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కరెడ్ల రాజిరెడ్డి టీఎస్‌యుటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్‌కుమార్, సంఘ ప్రతినిధులు మేర్గోజు మల్లేశం, పిల్లి రాజు, చింతల కనకయ్య, చంద్రయ్య, నర్సింహులు, హన్మారెడ్డి, మొహిజొద్దీన్, మల్లికార్జున్, రజిత, ప్రసాద్, శ్రీనివాస్, చంద్రమౌళి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **బీజేపీ పట్టణ కమిటీ నియామకం**

చేర్యాల(సిద్దిపేట): బీజేపీ పట్టణ కమిటీని నియమించినట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మన్నె సత్యవర్ధన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ కమిటీని ప్రకటించామన్నారు. ఉపాధ్యక్షులుగా కొట్టె చంద్రమౌళి, బిట్ల వెంకటేశం, పంగ సిద్ధిలింగం, ప్రధాన కార్యదర్శులుగా పల్లవు బాబు, బింగి శ్రీనివాస్, షాదుల్లా, కార్యదర్శులుగా గుడ్ల అంజయ్య, వల్మే బాపూరావు, బల్ల కిరణ్, కోశాధికారిగా కల్వకుంట్ల మనీష, యువ మోర్చా అధ్యక్షుడిగా ఎలుగల వినయ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా తుప్పతి రమేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా గణేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా పంతుల సుధాకర్ నియమితులయ్యారు.

◆ **మహాపాదయాత్రను విజయవంతం చేయండి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని మహా పాదయాత్ర నిర్వాహక సభ్యుడు బొమ్మల ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా సిద్దిపేటలోని అంబేద్కర్ నగర్ వాసులు నిర్వహిస్తున్న మహాపాదయాత్ర ఆదివారం ఉదయం 9 గంటలకు బాలాజీ థియేటర్ నుంచి పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందన్నారు.

◆ **సెల్‌ఫోన్ అందజేత**

చేర్యాల(సిద్దిపేట): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను 'సీఈఐఆర్' టెక్నాలజీ ద్వారా స్వాధీనం చేసుకుని ఫిర్యాదుదారుడికి అందజేసినట్లు ఎస్‌ఐ దామోదర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ చేర్యాలకు చెందిన ముజహిద్ తన సెల్ ఫోన్ జనవరి 9వ తేదీన పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు. నూతన టెక్నాలజీ ద్వారా ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకొని ఫిర్యాదుదారుడికి అందజేశారు.

